


బూటకపు హామీల్లో బాబు సూపర్

సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికలకు ముందు ఎన్డీయే నాయకులు చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్ తమ ప్రసంగాల్లో సూపర్ సిక్స్ పథకాల గురించి ఊదరగొట్టారు. అధికారంలోకి వస్తే వెంటనే అమలు చేస్తామని చెప్పారు. గ్రామాల్లో సైతం చిన్న నాయకులు కూడా పథకాలకు సంబంధించిన సమాచారంతో ప్రచారం చేశారు. 'తల్లికి వందనం' కింద ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి సంవత్సరానికి రూ.15 వేలు, 'అన్నదాత సుఖీభవ' కింద ప్రతి రైతుకు ఏడాదికి రూ.20 వేలు, యువతకు 20 లక్షల ఉద్యోగాలు లేదంటే ఉద్యోగం వచ్చే వరకు 'నిరుద్యోగ భృతి' కింద నెలకు రూ.3 వేలు, ప్రతి ఇంటికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 19–59 ఏళ్ల మహిళకు ప్రతి నెలా రూ.1,500 చొప్పున ఇస్తామని చెప్పారు. ఆయా పథకాల ద్వారా ఇంత వస్తుంది ... అంత వస్తుందని ఊదరగొట్టారు. ఇంతగా ఆశ పెట్టి వారి చేత ఓట్లు వేయించుకున్నారు. ప్రభుత్వం ఏర్పాటై 100 రోజులు పూర్తయినా వాటి గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. పాఠశాలలు మొదలైనా ఇప్పటివరకు తల్లికి వందనం ఊసే లేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా రైతులకు పెట్టుబడి సాయం కింద పైసా రాలేదు. దీంతో వారు అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొంది. గత ఐదేళ్లలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చెప్పినట్లుగా పక్కాగా పథకాలన్నీ అమలు చేసింది. ఆ సమయానికి లబ్ధిదారుల ఖాతాల్లో మొత్తం జమ అయ్యేలా చూసింది. కూటమి అధికారంలోకి వచ్చాక కొందరు మంత్రులు, ఎమ్మెల్యేలు ఇప్పట్లో వాటిని అమలు చేయలేమనే వ్యాఖ్యలు చేస్తుండటంపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గతంలో మాదిరిగా అధికారం కోసమే ఇచ్చే ఉత్తుత్తి హామీల జాబితాలో వీటిని చేర్చుతారా? అనే అనుమానాలు కలుగుతున్నాయి. ఇప్పటికైనా హామీలన్నీ వెంటనే అమలు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

సూపర్ సిక్స్ హామీలన్నీ వెంటనే అమలు చేయాలని ప్రజల డిమాండ్



ప్రతి మహిళకు నెలకు రూ.1,500


నియోజకవర్గాలవారీగా లబ్ధిదారులు

సత్తెనపల్లి	1,04,314
పెదకూరపాడు	91,720
నెలకు ఇవ్వాల్సిన సాయం	రూ.29.39 కోట్లు



జగన్ పాలనలో ఒక్కో ఏడాదికి రైతులకు అందిన సాయం

పథకం	నియోజకవర్గం	లబ్ధి (రూ.కోట్లలో)
రైతు భరోసా	సత్తెనపల్లి	57.39
	పెదకూరపాడు	63.79



టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి రైతులకు అందాల్సిన సాయం

నియోజకవర్గాలవారీగా లబ్ధిదారులు

సత్తెనపల్లి	42,516
పెదకూరపాడు	47,255
ఇవ్వాల్సిన సాయం	రూ.179.54 కోట్లు



యువతకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి

నియోజకవర్గాలవారీగా లబ్ధిదారులు

సత్తెనపల్లి	73,399
పెదకూరపాడు	45,000
నెలకు ఇవ్వాల్సిన సాయం	రూ.35.51 కోట్లు

జగన్ పాలనలో ఒక్కో ఏడాదికి తల్లికి అందిన సాయం

పథకం	నియోజకవర్గం	లబ్ధి (రూ.కోట్లలో)
అమ్మ ఒడి	సత్తెనపల్లి	38.59
	పెదకూరపాడు	59.52



టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి తల్లికి అందాల్సిన సాయం

నియోజకవర్గాలవారీగా లబ్ధిదారులు

సత్తెనపల్లి	40,597
పెదకూరపాడు	61,300
ఇవ్వాల్సిన సాయం	రూ. 152.84 కోట్లు

నిరుద్యోగులకు న్యాయం చేయరూ..



సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎన్డీయే సూపర్‌సిక్స్ హామీల్లో భాగంగా నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పింది. ప్రభుత్వం ఏర్పాటై 100 రోజులు పూర్తయింది. ఉద్యోగాలు కల్పించే వరకు ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగులకు రూ.3 వేల చొప్పున ప్రతి నెల చెల్లించి న్యాయం చేయాలి. లేకుంటే నిరుద్యోగుల ఆగ్రహానికి గురి కావాల్సి ఉంటుంది.

– కోనేటి సాయిప్రసన్న, సత్తెనపల్లి, పల్నాడు

తల్లికి వందనం వెంటనే అమలు చేయాలి



గత ప్రభుత్వంలో చెప్పిన ప్రకారం అమ్మ ఒడి కింద ఏటా మొత్తం అందించారు. కూటమి నాయకులు తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఎంత మంది పిల్లలు బడికి వెళ్తే అంత మందికి ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పాటై 100 రోజులు పూర్తయింది. ఈ ఏడాది తల్లికి వందనం అమలు చేయకపోతే పిల్లల ఫీజులు ఎలా కట్టాలి. నా ఇద్దరు బిడ్డలు బడికి వెళ్తున్నారు. భర్త తాపీ పనులు చేస్తేనే కుటుంబం గడిచేది.

– షేక్ షాహినా, సత్తెనపల్లి, పల్నాడు

తల్లికి వందనం నగదు జమ చేయాలి



మా కుమార్తె గ్రామంలో 9వ తరగతి చదువుతోంది. జగన్ సీఎంగా ఉండగా గత అయిదేళ్లు ఈ పాటికి అమ్మ ఒడి కింద మొత్తం జూన్‌లోనే ఖాతాలో వేసేవారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక ఇంట్లో విద్యార్థులందరికీ ఇస్తామన్నారు. ఆ మొత్తం ఇంతవరకు ఇవ్వలేదు. వెంటనే మాట నిలబెట్టుకోవాలి.

– గుదేటి మీనా, గృహిణి, కోనూరు

మహిళలకు నెలకు రూ.1,500 ఇవ్వాలి



ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఇస్తామని సూపర్ సిక్స్‌లో చేర్చి గత సార్వత్రిక ఎన్నికల సమయంలో ప్రచారం చేశారు. ప్రభుత్వం ఏర్పాటై 100 రోజులు దాటింది. ఇంత వరకు నెలకు ఇస్తామన్న పథకం ప్రస్తావనే లేదు. అర్హులైన ప్రతి మహిళకు వెంటనే ఆ మొత్తం అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

– చిలుకా వీరమ్మ, భాగ్యనగర్ కాలనీ, ధూళ్ళిపాళ్ల, పల్నాడు

క్లుప్తంగా

పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు

నకరికల్లు: మండలంలోని కుంకలగుంట గ్రామంలో సచివాలయం–1, రైతుభరోసా కేంద్రం ధ్వంసం కేసులో నిందితులుగా ఉంటూ పరారీలో ఉన్నవారి కోసం గాలింపుచర్యలు చేపడుతున్నట్లు రూరల్ సీఐ ఎం.రాంబాబు బుధవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈనెల 14వ తేదీన అర్ధరాత్రి కుంకలగుంట గ్రామంలో గల సచివాలయంలో ఎలక్ట్రికల్ సామగ్రి, కంప్యూటర్ పరికరాలు, ఫర్నీచర్, శిలాఫలకాలు ధ్వంసం చేసిన ఘటనలో ఐదుగురిని నిందితులుగా పోలీసులు గుర్తించారు. కార్యదర్శి సంజయ్‌కృష్ణ ఫిర్యాదు మేరకు వాచ్‌మెన్ లక్ష్మయ్య ద్వారా లభించిన ఆధారాలను సేకరించి దర్యాప్తులో భాగంగా ఐదుగురు నిందితుల్లోని జిడుగు నిరీక్షణరావు, ముసుకు ఏసురాజులను ఈనెల 15వ తేదీన అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు. మిగిలిన ముగ్గురు నిందితులైన బొడ్డు రామారావు, జిడుగు బిక్షమయ్య, ముప్వా ఆంజనేయులులను అరెస్ట్ చేయాల్సి ఉంది. ఈ విషయమై సీఐ మాట్లాడుతూ పరారైన నిందితులను త్వరలో అదుపులోకి తీసుకొని కోర్టుకు హాజరు పరుస్తామని వెల్లడించారు.

శ్రీవారికి ప్రత్యేక పూజలు



సత్తెనపల్లి: పట్టణంలోని రైల్వేస్టేషన్‌రోడ్డులో గల అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామివారి దేవాలయంలో పౌర్ణమి పూజ బుధవారం ప్రత్యేకంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవారిని ఉత్తర దిశగా ఊరేగింపు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై తీర్థ ప్రసాదాలు (గరుడముద్ద) స్వీకరించి స్వామి వారి కృపకు పాత్రులయ్యారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



రాజుపాలెం: పౌష్టికాహారంతో తల్లీబిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఏసీడీపీఓ సంతోషకుమారి సూచించారు. మండలంలోని రెడ్డిగూడెం గ్రామంలో పోషకాహార వారోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పోషణవేడుక, సీమంతాలు జరిపించి పౌష్టికాహారంపై తల్లులకు అవగాహన కల్పించారు. సీహెచ్ఓ జ్యోత్స్న, సెక్టార్ సూపర్‌వైజర్ ఆర్.కె.రమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా నంబూరు శంకరరావు జన్మదిన వేడుకలు

- భారీగా తరలివచ్చిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు
- కార్యకర్తలకు అండగా ఉంటానని శంకరరావు హామీ
- గజమాలతో సత్కారం
- వృద్ధులకు రగ్గులు పంపిణీ



కార్యకర్తలు, అభిమానుల నడుమ భారీ కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

పెదకూరపాడు: మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పుట్టినరోజు వేడుకలు బుధవారం గుంటూరులోని వైఎస్సార్ సీపీ పెదకూరపాడు నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని అచ్చంపేట, బెల్లంకొండ, పెదకూరపాడు, అమరావతి, క్రోసూరు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అభిమానులు భారీ గజమాలతో శంకరరావును సత్కరించారు. వృద్ధులకు రగ్గులను పంపిణీ చేశారు. భారీ కేక్ కట్ చేశారు.

క్రోసూరులో...

క్రోసూరు: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పెదకూరపాడు మాజీ శాసనసభ్యుడు నంబూరుశంకరరావు జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు అనుముల కోటిరెడ్డి, టౌన్‌పార్టీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖాదర్‌లు మాట్లాడుతూ ప్రజాసేవకు నిరంతరం ముందుండే నంబూరు శంకరరావు, ఆయన కుటుంబం ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలన్నారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియచేసారు. టపాసులు, బాణసంచా కాల్చారు. ఈకార్యక్రమంలో ముజావర్, రవీంద్రబాబు, చిలకా దాసయ్య, జీవరత్నం, పార్టీనాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



అచ్చంపేటలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



క్రోసూరులో కేక్ కట్ చేస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

అచ్చంపేటలో...

అచ్చంపేట: అచ్చంపేటలోని వైఎస్సార్ విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు జన్మదినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పార్టీ నేతలు కేక్ కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ కన్వీనర్ చిల్కా చంద్రయ్య మాట్లాడుతూ పెదకూరపాడు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే శంకరరావు హయాంలోనే రోడ్లు బాగుపడ్డాయని, అచ్చంపేట పోలీస్ స్టేషన్, పీహెచ్‌సీ భవనం, హైస్కూలు, గురుకుల పాఠశాలలో అదనపు తరగతి గదులు, నాడు–నేడు నిధులతో ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణ వంటి ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. శంకరరావు మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఎంపీపీ గంగసాని నరసింహారెడ్డి, మాజీ ఎంపీపీ భూక్యా కృష్ణానాయక్, సొసైటీ మాజీ ఛైర్మన్లు తుమ్మా చిన్నపరెడ్డి, రామిశెట్టి రంగయ్య, ముస్లిం మైనారిటీ సెల్ అధ్యక్షుడు బీరువాల జాని, సర్పంచ్ షేక్ జాని, కంబాల వీరబాబు, టౌన్‌పార్టీ అధ్యక్షుడు షేక్ సైదావలి, మైనారిటీ నాయకులు కమల్ సైదా, షేక్ నాగులు, మాజీ సర్పంచ్ సుంకర శ్రీనివాసరెడ్డి, సూర్యనారాయణ, చిన్నయల్లమందయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం మోడల్‌తో రైతులకు నిరంతరం ఆదాయం

ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమల కుమారి



వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలిస్తున్న డీపీఎం అమలకుమారి

బెల్లంకొండ: ప్రకృతి వ్యవసాయ విధానంలో ఏటీఎం మోడల్ విధానాన్ని పాటించడం ద్వారా రైతులు నిరంతరం ఆదాయం పొందవచ్చని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.అమల కుమారి తెలిపారు. బుధవారం మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సిబ్బందితో కలసి ఆమె సందర్శించారు. ఆమె మాట్లాడుతూ ఏటీఎం మోడల్‌లో మొత్తం 27 రకాల పంటలు కూరగాయలు, ఆకుకూరలు, దుంప జాతి, తీగజాతి, నూనె జాతి, పూలరకాల పంటలను ఒకే పొలంలో వేసి 365 రోజులు కూడా ఆదాయాన్ని పొందవచ్చన్నారు. భూములలో వివిధ రకాల పంటలు వేయటం వలన జీవవైవిధ్యం పెరిగి అధిక దిగుబడి వస్తుందన్నారు. అనంతరం గ్రామంలో వేసిన ఏ–గ్రేడ్ మోడల్ వరి పంటలను సందర్శించారు. రైతు సాధికార సంస్థ సీటీఎల్ ప్రవీణ్ కుమార్, శివరామకృష్ణ, అనంతలక్ష్మి, అంజలి, మహిళా రైతులు జ్యోతి, మాధవి పాల్గొన్నారు.

పత్తిపంటల పరిశీలన...

పెదకూరపాడు: సత్తెనపల్లి సబ్–డివిజన్ పరిధిలో పెదకూరపాడు గ్రామంలో బుధవారం ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి పత్తి పంటలను పరిశీలించారు. ఆగస్టులో కురిసిన వర్షాలకు నీట మునిగిన పత్తి పంట వ్యవసాయ క్షేత్రాలను అమల కుమారితో పాటు రైతు సాధికార సంస్థ కమ్యూనికేషన్ థిమేటిక్ లీడ్ ప్రవీణ్ కుమార్, శివ రామకృష్ణ, విజయ్ కుమార్, వ్యవసాయ సిబ్బంది వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నందకుమార్, మాస్టర్ ట్రైనర్ మధుబాబు, ప్రకృతి వ్యవసాయ రైతులు అమూల్య, శంకర్, జ్యోస్నా, ఉదయ లక్ష్మి, మహబూబి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

32 అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహ నిర్మాణం పూర్తి



నూతనంగా నిర్మించిన అభయాంజనేయ స్వామి విగ్రహం

క్రోసూరు: క్రోసూరు శివారు చెరువు కట్టవద్ద ప్రధాన రహదారి పరిధిలో చేపట్టిన 32 అడుగుల అభయ ఆంజనేయ స్వామి విగ్రహ నిర్మాణం పూర్తిచేసుకుంది. ఈసందర్భంగా అభజయాంజనేయస్వామికి పత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలు సుఖ శాంతులతో ఉండాలని, రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండేలా అభయాంజనేస్వామి రక్షించాలన్న సంకల్పంతో గ్రామం పెద్దలు విగ్రహ నిర్మాణం రెండు సంవత్సరాల క్రితం ప్రారంభించారు. విగ్రహ శిల్పి వెంకటరామరాజును ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. మాజీ యార్డు చైర్మన్ కాంద్రు కాశయ్య, జై భజరంగ్ భళి కమిటీ సభ్యులు గురునాధం, కర్నాటి కృష్ణారావు ,సిద్దు కామేశ్వరాచారి, బాలకృష్ణ, కంబంపాటి కొండలు ,బీవీ శర్మ, రామాంజనేయులు, అంజిరెడ్డి, ఎం .నాగేశ్వరావు, ఎం.రామాంజనేయులు, ఎ.వెంకట్రావు, సుబ్రమణ్యాచారి, నూతక్కి సత్యన్నారాయణాచారి, భక్తులు పాల్గొన్నారు

ఘనంగా ప్రపంచ వెదురు దినోత్సవం



వెదురు దినోత్సవంలో పాల్గొన్న మేదరి సంఘ నేతలు

సత్తెనపల్లి: పట్టణ మేదరి సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో బుధవారం ప్రపంచ వెదురు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పల్నాడు జిల్లా అధ్యక్షుడు జొరిగే వెంకట శ్రీనివాసరావు, యడ్లపాడు సంఘ నాయకులు కొండా కృష్ణమూర్తి, జిల్లా మహిళసంఘ అధ్యక్షురాలు పిల్లి పద్మావతి, జిల్లా యువజనసంఘ అధ్యక్షుడు తుమ్మల వెంకటేష్ బాబు, హాజరై కేతేశ్వర స్వామికి పూలమాలలతో పూజలు చేశారు. జిల్లా కమిటీని పట్టణ మేదరి సంఘం కార్యవర్గం సన్మానించారు. అనంతరం జిల్లా కమిటీ కొత్తగా ఎన్నికైన పట్టణ అధ్యక్షుడు తుమ్మల శ్యామ్ కుమార్‌ని సన్మానించారు. కార్యక్రమంలో పట్టణ సెక్రటరీ జొరిగె సుబ్బారావు, కోశాధికారి చందా శేషగిరి, వైస్ ప్రెసిడెంట్ చందా చిన్న బాలకోటేశ్వరరావు, సహాయ కార్యదర్శి జొరిగే ఆంజనేయులు, పెద్దలు తుమ్మల ఏడుకొండలు, తుమ్మల నాగ ప్రసాద్, జొరిగే కోటేశ్వరరావు, తుమ్మల వెంకటేశ్వరరావు, సూదేపల్లి శ్యామ్, జొరిగే ఏడుకొండలు, తుమ్మల శ్రీపతి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మాదలలో పోషణ మాసోత్సవం

మాదల(ముప్పాళ్ళ): ఐసీడీఎస్, ఇరుకుపాలెం సెక్టార్ పరిధిలోని మాదల గ్రామంలో పోషణ మాసోత్సవం కార్యక్రమం బుధవారం జరిగింది. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జీ.జయలక్ష్మీ పాల్గొని గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పోషకాహారంపై అవగాహన కల్పించారు. గర్భిణులకు రక్తపరీక్షలు నిర్వహించారు. స్వచ్ఛత హీసేవా కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. గర్భిణులకు సీమంతం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి జి.శ్రీనివాసరావు, మహిళా సంరక్షణ కార్యదర్శి పి.వర్ధిని, అంగన్‌వాడీకార్యకర్తలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం

అచ్చంపేట: ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతంగా జీవించాలంటే ప్రధానంగా మనచుట్టూ ఉండే పరిసరాలను, మనం తిరిగే వీధులను శుభ్రంగా ఉంచుకోవాలని ఐటీసీ కమ్యూనిటీ ఆర్గనైజర్ సతీష్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఐటీసీ, సెర్ప్, గ్రామపంచాయతీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం అచ్చంపేటలో జరిగిన ర్యాలీలో ఐటీసీ కమ్యూనిటీ ఆర్గనైజర్ సతీష్ మాట్లాడారు. ప్రస్తుతం వ్యాధుల సీజన్ జరుగుతుందని, దోమల వల్లనే దోమల తీవ్రత ఎక్కువగా ఉంటుందన్న విషయాన్ని గ్రహించాలన్నారు. అనంతరం మానవ హారం నిర్వహించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటామంటూ విద్యార్థులు, గ్రామస్తులచేత ప్రతిజ్ఞ చేయించారు. పంచాయతీ కార్యదర్శి ఏవీ సుబ్బారావు, స్థానిక జడ్పీహెచ్ స్కూలు ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

దోమలవ్యాప్తిని అరికడదాం



రాజుపాలెం: పరిసరాల పరిశుభ్రత పాటించి దోమలవ్యాప్తిని అరికట్టాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి చంద్రశేఖర్ సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మండలంలోని దేవరంపాడు గ్రామంలో బుధవారం ఫాగింగ్, పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఇంటింటికి వెళ్లి సీజనల్‌వ్యాధులకు కారణాలను అవగాహన కల్పించి తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆరోగ్య పర్యవేక్షకురాలు ఉషా రాణి, సీహెచ్ఓ లక్ష్మీదుర్గ, మహిళా ఆరోగ్య కార్యకర్తలు నాగమణి, శారదా తదితరులు పాల్గొన్నారు.

ముప్పాళ్లలో...

ముప్పాళ్ళ: మండలంలోని గోళ్ళపాడు, కుందురువారిపాలెం, ముప్పాళ్ళ గ్రామాల్లో స్వచ్ఛత హీసేవా పక్షోత్సవాలలో భాగంగా బుధవారం దోమల నివారణకు మందు పిచికారీ చేయించారు. ఆయా గ్రామ పంచాయతీ, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య చర్యలలో భాగంగా వెక్టోబ్యాక్ట్ అనే మందును మురుగు కాల్వల్లో పిచికారీ చేయించారు. పంచాయతీ కార్యదర్శులు భార్గవ్‌శ్యామ్, ఆర్.నాగేశ్వరరావు, సర్పంచ్ గోపు అప్పమ్మ, హెల్త్ సిబ్బంది పర్యవేక్షించారు.

లైంగిక వేధింపులపై సత్వరం ఫిర్యాదు చేయాలి

సత్తెనపల్లి: లైంగిక నేరాలకు పాల్పడేవారు చాలావరకు పరిచయస్తులేనని, ప్రాథమిక దశలోనే వారి ప్రవర్తన ముందస్తుగా గ్రహించగలగాలని, ఎప్పుడైనా లైంగిక వేధింపులు ఎదురైతే వెంటనే ఫిర్యాదు చేయాలని ఏసీడీపీఓ సంతోష కుమారి అన్నారు.

పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో 6 నుంచి ఇంటర్మీడియెట్ వరకు విద్యనభ్యసిస్తున్న బాలికలకు బాలల హక్కులు, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, తదితర వాటిపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీడీపీఓ సంతోషకుమారి మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలని, బాల్యవివాహాలు అనేక విధాలుగా నష్టాన్ని కలిగిస్తాయన్నారు. ఫోక్సో చట్టం ద్వారా స్వీయ రక్షణ ఎలా చేసుకోవాలి? అత్యాచారాలును ఎలా ఎదుర్కోవాలి? తెలివిగా ఎలా స్వీయ రక్షణ చేసుకోవాలి? అనే దానిపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ ఆర్.అరుణ, జె.ప్రశాంతి, కోటేశ్వరరావు, మంగమ్మ, హెడ్ కానిస్టేబుల్ బి.కోటేశ్వరరావు, కేజీబీవీ ప్రత్యేక అధికారిణి ప్రసన్న రాణి, కస్తూర్బా గాంధీ విద్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.